క్లుప్తంగా

గీతా చాలీసా పారాయణం నేడు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం) : గీతావైభవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రెండువేల మంది విద్యార్థులతో 'గీతా చాలీసా కంఠస్థ పారాయణం' ఉంటుందని, సాయంత్రం మహానగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ షేక్ నజీర్‌బాషా గురూజీ తెలిపారు. మూలాపేట శివగిరికాలనీలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతాజయంతిలో భాగంగా సుజాతమ్మ కాలనీలో ఉన్న రాధాకృష్ణ ధ్యానమందిరం ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని 40 పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులతో గీతా చాలీసా పారాయణం చేయనున్నారన్నారు. కార్యక్రమ నిర్వహణాధికారి జాలాది నాగేశ్వరరావు, బాలవికాస్ కమిటీ చైర్మన్ వెల్లటూరు శివజ్యోతి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి పి.రాజారామ్, సహాయ కోశాధికారి సీహెచ్ శశిధర్, నిర్వాహకులు, సభ్యులు ఎస్.విజిత, జి.లీలావతి, సీహెచ్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మరపురాని మహానటి సూర్యకాంతం



రేబాల శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న ప్రముఖులు

నెల్లూరు(బృందావనం) : సహజ నటనతో అలరించిన సూర్యకాంతం మరపురాని మహానటి అని హైదరాబాద్‌కు చెందిన సినీ విశ్లేషకుడు ఎస్వీ రామారావు తెలిపారు. పుర మందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేనేత సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహానటి సూర్యకాంతం శత జయంతి వేడుక' బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ ప్రపంచంలో ఎంతో కీర్తి ప్రతిష్టలు గడించారన్నారు. కృష్ణపట్నం ఇమామి అగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ నారాయణమూర్తి, మాటల రచయిత డాక్టర్ పి.రాజేంద్రకుమార్, లఘుచిత్ర నిర్మాత జమలాపురం రాధాకృష్ణ, ఎం.రామచంద్రప్రసాద్ తదితరులు సూర్యకాంతం జీవిత విశేషాలను వివరించారు. అనంతరం రామారావు రూపొందించిన 'మహానటి సూర్యకాంతం' డాక్యుమెంటరీని ప్రదర్శించారు. రంగస్థల నటి రేబాల శ్రీలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో నలుబోలు బలరామయ్యానాయుడు, ఎ.జయప్రకాష్, జి.సుభద్రాదేవి, ఆర్.రఘు, నిర్వాహకులు వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే విజయం



మాట్లాడుతున్న మంత్రి ఆనం

నెల్లూరు(సెంట్రల్) : జిల్లాలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అందరి సహకారంతోనే విజయం సాధ్యమైందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులు రైతుల మేలు కోసం పనిచేయాలన్నారు. ఈనెల 21న ప్రాజెక్ట్ కమిటీలకు కూడా అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎంపిక చేస్తామన్నారు. రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

కోవూరు : మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమెన్స్ హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నలుమూలల నుంచి దాదాపుగా 60 మంది పోటీల్లో పాల్గొని, జట్టుకు ఎంపికయ్యారు. వీరు బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం స్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్ విక్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు భీమతాటి వెంకటరమణయ్య, మధుసూదన్‌రావు, ప్రవీణకుమారి, శ్యామ్, ప్రదీప్ అజయ్ పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు

- నగరంలో 6,500కు పైగా ఖాళీ స్థలాలు
- పేరుకుపోతున్న చెత్తా చెదారాలు
- యజమానులను హెచ్చరించినా స్పందన కరువు

నగరంలోని ఓపెన్ ప్లాట్లు ప్రజలతో పాటు అధికారులకు తలకు మించిన భారంగా మారింది. వర్షాకాలంలో ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. అంతేకాకుండా చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి పారిశుధ్యం కొరవడుతోంది. దీంతో ఖాళీ స్థల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో కార్పొరేషన్‌కు స్వచ్ఛతా సంకల్పం నీరు గారుతోంది. అంతే కాకుండా ప్రజలను రోగాల బారిన పడేస్తున్నాయి.



అన్నమయ్య సర్కిల్ సమీపంలో అపార్ట్‌మెంట్ల మధ్య ఖాళీ స్థలంలో చేరిన నీరు

నెల్లూరు(బారకాసు) : నగర కార్పొరేషన్ పరిధిలో దాదాపు 6,500కు పైగా ఓపెన్ ప్లాట్స్ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విపరీతంగా పెరిగిపోయాయి. ఖాళీ స్థలాలు దోమలకు నిలయంగా మారి డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో పెద్ద ఎత్తున స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. మరో వైపు కొత్త కాలనీలు ఏర్పడి పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. నెల్లూరు కార్పొరేషన్‌లో వేలాది సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉండడంతో వాటి నిర్వహణ గురించి యజమానులు పట్టించుకోకుండా ఉండడంతో పిచ్చిమొక్కలు, పొదలు, చెత్త పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఖాళీ స్థలాల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమీప నివాస ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు.

నోటీసుల జారీ

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల వల్ల ఇబ్బందులు ఉన్నాయని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు కార్పొరేషన్ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు స్థల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త, చెదారం, పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ లెక్కన కార్పొరేషన్ పరిధిలో దాదాపు 6500కు పైగా ఉన్న ఖాళీ స్థలాలకు సంబంధించిన యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ వారి నుంచి స్పందన రాకపోవడంతో సీజనల్ వ్యాధుల కట్టడి సమస్యగా మారింది.

అధికారులపై అదనపు ఒత్తిడి

ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోవడంతో కార్పొరేషన్ సిబ్బందే శుభ్రం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సమస్యను అధిగమించేందుకు కొత్త ప్రయోగం చేయాలని సంకల్పించింది. వన మహోత్సవంలో భాగంగా ఖాళీ స్థలంలో ప్రస్తుతం ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారం తొలగించి మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయా ఖాళీ స్థలాల యజమానులను ఇందులో భాగస్వామ్యం చేయాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం



ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, పొదలు తొలగించి, పారిశుధ్యం మెరుగు పరచాలని యజమానులకు నోటీసులు జారీ చేశాం. స్పందించకుంటే ఖాళీ స్థలాల్లో పారిశుధ్య పనులు చేపట్టి వారి ద్వారా సంబంధిత చార్జీలు వసూలు చేస్తాం.

– డాక్టర్ చైతన్య, హెల్త్ ఆఫీసర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను మారుస్తున్నందున గురువారం పలు ప్రాంతాల్లో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం తెలిపారు. రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతి నగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

పాస్టర్లకు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలువురు పాస్టర్లను వికలాంగుల ఐక్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్ బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, శ్రీవాణి హైస్కూల్ చైర్మన్ విజయ్, పాస్టర్లు సురేష్, రాజా, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి



మూడో డివిజన్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాలు, తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మూడో డివిజన్ వెంగళరెడ్డి నగర్ ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పన్నుల వసూళ్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. మొండి బకాయిదారులు, అనధికార కుళాయి కనెక్షన్లు కలిగిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనధికార భవన నిర్మాణాలు, అనుమతులు లేకుండా ఎలాంటి కట్టడాలు జరగకుండా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. స్థానికంగా జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణం, రోడ్ల మరమ్మతులను వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉన్న వీధి కుక్కలను గుర్తించి వ్యాక్సినేషన్ చేయించి విడిచిపెట్టాలని, పశువులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగర సర్వీసు ప్రారంభం నేడు

నెల్లూరు సిటీ : నగరంలోని అయ్యప్పగుడి నుంచి చిన్న నరుకూరు వరకు ప్రధాన ప్రాంతాల మీదుగా బస్సు సర్వీసును గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు నెల్లూరు డిపో–2 మేనేజర్ శివకేశవ్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పగుడి నుంచి వయా ఆర్టీసీ మీదుగా ఆత్మకూరు బస్టాండు, పెద్ద చెరుకూరు, నరుకూరు, చిన్న చెరుకూరు వరకు బస్సు సర్వీసు ఉంటుందని, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రారంభిస్తారని తెలియజేశారు. అయ్యప్పగుడి నుంచి ఆర్టీసీ వరకు రూ.10, ఆత్మకూరు బస్టాండ్ వరకు రూ.20, నరుకూరు, చిన్న చెరుకూరు వరకు రూ.30లుగా నిర్ణయించారు. ప్రతిరోజూ ఏడు ట్రిప్‌లు నడపనున్నారు.

ఆర్‌ఐ బదిలీ

నెల్లూరు(క్రైమ్) : రాష్ట్ర వ్యాప్తంగా 16 మంది ఆర్‌ఐలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్లలో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసరెడ్డి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆక్రమణల తొలగింపు



ప్రహరీని కూలుస్తున్న జేసీబీ

నెల్లూరు(బారకాసు) : స్థానిక 37వ డివిజన్ రామ్‌నగర్, మూడో వీధిలోని ఆక్రమణలను బుధవారం తొలగించారు. రోడ్డును ఆక్రమిస్తూ ఇంటి ప్రహరీ నిర్మాణం జరుగుతున్నట్లు గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు కమిషనర్ సూర్యతేజకు ఫిర్యాదు చేసి ఉన్నారు. దీంతో స్పందించిన ఆయన నోటీసులు జారీ చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సర్వే రిపోర్ట్ పరిశీలించిన అనంతరం జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వేణు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శీవేలి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో భాగంగా స్వామివారికి శీవేలి ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా పి.నరసింహారావు– అనూరాధ, పెంచలయ్య–ధనమ్మ, వి.నారాయణ– కవిత, విశ్వేశ్వరశర్మ–పద్మజ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్పసేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య, కె.మోహన్‌రావు, జి.విజయకుమార్, పి.ప్రసాద్ పర్యవేక్షించారు.

మైనార్టీల హక్కులను కాలరాయడం దారుణం



మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రషీద్

నెల్లూరు(అర్బన్) : ఓట్ల కోసం ప్రభుత్వాలే మైనార్టీల హక్కులను కాలరాయడం దారుణమని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్.రషీద్ అన్నారు. మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మినీబైపాస్‌లోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులతో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ దేశంలో నామమాత్రంగానే మైనార్టీల హక్కులు అమలవుతున్నాయన్నారు. గత 11 ఏళ్లుగా వివిధ కారణాలతో మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. కొందరు రాజకీయ నాయకులు హిజాబ్, హలాల్, తినేతిండి పేరుతో ప్రజల్లో విభేదాలు సృష్టించి దాడులు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. మైనార్టీలకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లను, ఫెలోషిప్పులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసి తమకు విద్య అందుబాటులో లేకుండా చేయడం తగదన్నారు. మధ్యతరగతి ఉద్యోగ సంఘాల నాయకుడు ఆర్.నగేష్ మాట్లాడుతూ లౌకికతత్వం ఉన్న దేశంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పాలన జరగాల్సి ఉందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బీపీ నరసింహ మాట్లాడుతూ మైనార్టీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు మాబాషా, రియాజ్, అన్సర్, ఫయాజ్, సమీవుల్లా పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుతో హెల్త్ అసిస్టెంట్లకు ఊరట



మాట్లాడుతున్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు

నెల్లూరు(అర్బన్) : ఇటీవల వైద్యశాఖలో తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకునేలా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఎంతో ఊరట కలిగిస్తోందని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తెలిపారు. సంతపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో సంఘ కార్యవర్గ సభ్యుల అత్యవసర సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా నుంచి 54 మందిని, రాష్ట్ర వ్యాప్తంగా 1,200 మందికిపైగా హెల్త్ అసిస్టెంట్లను తెలంగాణ కోర్టు తీర్పుతో ఇటీవల తొలగించారన్నారు. అయితే అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం 20 రోజుల్లో తొలగించిన ప్రతిఒక్కరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. డీఎంహెచ్‌ఓ సత్వరమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా సెక్రటరీ కమల్‌కిరణ్ పాల్గొన్నారు.

రాయితీపై దంత వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ దివ్యరెడ్డి

నెల్లూరురూరల్ : డాక్టర్ కొండారెడ్డి దంత వైద్యశాల 54వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు దంత చికిత్సలపై రాయితీలు ఇస్తున్నట్లు డాక్టర్ దివ్యరెడ్డి తెలిపారు. స్థానిక జర్నలిస్టు భవన్‌లో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. తమ వైద్యశాల బృందావనం, చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులో ఉన్న ఆస్పత్రుల్లో డిసెంబర్ 31 వరకు ఉచిత కన్సల్టేషన్‌తో పాటు డెంటల్ ఎక్స్‌రేపై 50 శాతం, అన్ని రకాల దంత చికిత్సలపై 20 శాతం రాయితీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నగరంలో చిరుజల్లులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో నగరంలో బుధవారం చిరుజల్లులు కురిశాయి. అయితే రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంది. దీనికి తోడు చలిగాలులు కూడా తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



బీవీనగర్‌లో జోరువానలో వాహనదారుల కష్టాలు





ఖాజా రహంతుల్లా రాజీనామా ఆమోదం

నెల్లూరు (టౌన్) : బీటీఏ(బహుజన టీచర్స్ అసోసియేషన్) నగర సభ్యుడు షేక్.ఖాజా రహంతుల్లా రాజీనామాను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు బీటీఏ నగర అధ్యక్షుడు పెంచలప్రసాద్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. స్థానిక ఆనకట్టరోడ్డులోని ఎంసీపీఎస్‌లో నగర కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాజా రహంతుల్లా రాజీనామా లేఖను రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పంపారని, అందులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు ఆదినారాయణ, మాల్యాద్రి, వేణుగోపాల్‌లను తీవ్ర పదజాలంతో దూషిస్తూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. బీటీఏ పోరాట ఫలితంగా ఆయన ఉద్యోగం పొంది నేడు ఆ సంఘంతో పాటు నాయకులను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.